క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

గద్వాల అర్బన్: 33కేవీ మార్లబీడు ఫీడర్‌కు విద్యుత్ సరఫరా అయ్యే లైన్లకు చెట్ల కొమ్మలు తగలడంతో అంతరాయం ఏర్పడుతుందని, చెట్ల కొమ్మలను తొలగించేందుకు ఎల్‌సీ తీసుకోవడంతో బుధవారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరూరు మండలంలోని మార్లబీడు, అల్వాల్‌పాడు గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి 10గంటలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నందిన్నె చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మంగళవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టును ఎక్సైజ్ సీఐ నరేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి మద్యం, డబ్బు రాకుండా అధికారులు గట్టి బందోబస్తుతో తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఐటీబీపీ పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఫాసిస్టు శక్తులను ఓడించండి

శాంతినగర్: నియంతృత్వ ఫాసిస్టు శక్తులను ఓడించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు జమ్మిచేడ్ కార్తీక్ అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్ అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం కరపత్రాలు విడుదల చేశారు.

మద్యం పట్టివేత

గద్వాల క్రైం: మద్యం విక్రయిస్తున్న ముగురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గోపాల్ తెలిపారు. మంగళవారం గద్వాల, ధరూర్ మండలంలోని ఎల్లప్ప, కిష్టన్న, శ్రీనివాస్‌రెడ్డిలు మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి సోదాలు చేశారు. వారి నుంచి రూ.68వేల విలువ గల మద్యం స్వాధీనం చేసుకుని వారి నుంచి రెండు బైక్‌లు, కారు సీజ్ చేశామని సీఐ తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల పరిధిలోని ధర్మవరం గ్రామానికి చెందిన బోయ వెంకటన్న అనుమతులు లేకుండా తన షాపులో మద్యాన్ని విక్రయిస్తున్నాడు. ఈ సమాచారం తెలియడంతో మంగళవారం పోలీసులు తనిఖీ చేసి 4.1 లీటర్లు (రూ. 2300) మద్యాన్ని పట్టుకొని అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ కృష్ణదేవా తెలిపారు. పీఎస్‌కు తరలించి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముమ్మరంగా ప్రచారం

- అలంపూర్ నియోజకవర్గంలోని రైతుల సాగు నీరు కష్టాలను తీరుస్తానని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం మానవపాడు మండలంలోని జల్లాపురం, బోరవెల్లి పల్లెపాడు, చండూరు గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
- జిల్లా కేంద్రంలోని 24వ వార్డులో మంగళవారం కాంగ్రెస్ అభ్యర్థి సరిత జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మల్దకల్ సంతబజార్‌లో రాత్రి ఆశీర్వాద సభ నిర్వహించారు. ఆమెకు మద్దతుగా మల్దకల్ మండలంలోని ఉలిగేపల్లి, మేకలసోంపల్లి, మల్దకల్, తాటికుంటలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.
- ధరూరు మండలంలోని అల్వలపాడు, కోతులగిద్ద, కొత్తపాలెం గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి శివారెడ్డితో కలిసి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
- రాజోళి మండలం తుమ్మిళ్లలో అలంపూర్ నియోజవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజేయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శాంతినగర్, పైపాడు, కోయిల్‌దిన్నెలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రచారం హోరెత్తించారు.
- కేటీదొడ్డి మండలం నందిన్నెలో బీజేపీ నాయకులు నాగేష్, ప్రకాష్‌రావు ప్రచారం నిర్వహించారు.

గ్రామాల్లో నాయకుల ప్రచారం

- ఉండవెల్లి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు.
- అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి గొంగళ్ల రంజిత్ కుమార్ ధరూరు మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
- బీజేపీ అభ్యర్థి రాజగోపాల్ జూలెకల్, జక్కిరెడ్డిపల్లి, తిమ్మాజిపల్లిలో ప్రచారం చేశారు. బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రసన్నకుమార్ వెంకట్రామనగర్, జూలెకల్, జక్కిరెడ్డిపల్లి, తిమ్మాజిపల్లి, వడ్డేపల్లి, కోయిల్‌దిన్నె, శాంతినగర్, జిల్లెడుదిన్నె, రామాపురంల్లో ప్రచారం చేశారు.
- బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి అతికూర్ రహ్మాన్ ధరూరు మండలంలోని జాంపల్లి, అల్వలపాడు, కోతులగిద్ద గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
- ఎర్రవల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో ఆయా పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు.

కాంగ్రెస్ గెలిస్తే దళారుల రాజ్యం

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



సంగాలలో బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణమోహన్ రెడ్డికి పూలవర్షం కురిపిస్తున్న ప్రజలు

గద్వాల రూరల్: దోపిడీదారుల మాటలు నమ్మి మోసపోవద్దని బీ ఆర్ఎస్ అభ్యర్థి కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గద్వాల మండలంలోని మార్లపల్లి, జిల్లెడబండ, సంగాల గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించా రు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ప్రజల మధ్య చిచ్చులు పెడుతూ కుల, మతాల పేరుతో వివిధ రకాల వేషాలతో వస్తున్నారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అభ్యర్థి కృష్ణమోహన్‌రెడ్డికి సంగాలలో పూలవర్షం కురిపించారు. జిల్లెడబండ గ్రామంలో రామక్క రామక్క పాటకు ఆయనతో పాటు బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు డ్యాన్స్ చేస్తూ సందడి చేశారు.

గద్వాలను అభివృద్ధి చేసుకుందాం

మన ఓటను మనకే వేసుకుని మన గద్వాలను మరింత అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆయన స్థానిక గౌడసంఘం. చేనేత సంఘం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పెద్దఎత్తున అభివృద్ధి జరిగిందని, ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పదవిలో ఉంటూ ఇప్పుడు ఎన్నికలు వచ్చేసరికి కేవలం పదవీకాంక్షతో పార్టీ మారి గద్వాల ప్రాంతానికి సంబంధం లేని వ్యక్తులు ఎన్నికల్లో నిలబడి అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నట్లు తెలిపారు. వారి రెచ్చగొట్టే మాటలకు ఆవేశపడకుండా సంయమనంతో వ్య వహరించి గద్వాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేలా ముందుకు కదులుదామన్నారు. తన క్యాంపు కార్యాలయంలో గద్వాల పట్టణం, ధరూరు, గట్టు, కేటీదొడ్డి, మల్దకల్ మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన ఐదేళ్ల ప్రజల మధ్యలో ఉండి అభివృద్ధి చేశానన్నారు.

బీఆర్ఎస్‌తోనే పట్టణాభివృద్ధి..

గద్వాల అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యపడుతుందని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని, ఈ పట్టణ భవిష్యత్ ప్రజల చేతిలోనే ఉందని అన్నారు. ఎమ్మెల్యే తనయుడు సాకేత్‌రెడ్డి, పార్టీ నాయకులు గద్వాల మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కేటీదొడ్డి మండలంలో మండల అధ్యక్షుడు ఉరుకుందు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ధరూరు మండలంలో జెడ్పీటీసీ సభ్యురాలు ప ద్మా వెంకటేశ్వరరెడ్డి, మండల అధ్యక్షులు డీఆర్ విజయ్ కుమార్‌లు అల్వలపాడు, జాంపల్లిలో ప్రచారం చేశారు. మల్దకల్ మండలంలోని చర్లగార్లపాడు, మల్దకల్, పెద్దొడ్డి, శేషంపల్లిలో ఎంపీపీ రాజారెడ్డి, తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ సత్యారెడ్డి ప్రచారం నిర్వహించారు. గట్టు మండలం బల్గెరలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



మాట్లాడుతున్న అభ్యర్థి కృష్ణమోహన్ రెడ్డి



గద్వాలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తనయుడు సాకేత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్



గౌడసంఘం సమ్మేళనంలో పాల్గొన్న గౌడసంఘం కులస్తులు

ఫర్నీచర్‌పై ఇంత నిర్లక్ష్యమేలా?



రాజోళి జెడ్పీహెచ్ పాఠశాలలో చెట్లకు వేలాడదీసిన బెంచీలు

రాజోళి: ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు, కావాల్సిన ఫర్నీచర్ లేదని కొన్ని చోట్ల ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆందోళనపడుతున్నారు. మరి కొన్ని చోట్ల దాతలను సంప్రదించి పాఠశాలకు కావాల్సిన వాటిని సమకూర్చుకుంటున్నారు. కాని ఇక్కడ ఉపాధ్యాయులకు, పాఠశాల సిబ్బందికి మాత్రం అవేమీ పట్టనట్లుగా కనిపిస్తోంది. మండల కేంద్రం రాజోళిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బెంచీలకు రక్షణ లేకుండా పోయింది. ఇనుప బెంచీలను గతంలో కొందరు దొంగలించగా, మిగిలిన వాటిలో కొన్ని పూర్తిగా ధ్వంసం అవుతున్నాయి. పాఠశాల ఆవరణలో ఉన్న చెట్లకు ఆకతాయిలు కొందరు వేలాడదీయగా, విద్యార్థులు వాటితో ఆడుకుంటున్నారు. ఫర్నీచర్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత లేకుండా పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ పూజలు



అయిజ: మండల కేంద్రంలో కాళమ్మపేటలో నూతనంగా నిర్మించిన కాళికాదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేశారు. బుధవారం నుంచి పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తుల పాలిట కొంగు బంగారమై, కోరిన కోర్కెలు తీర్చే కాళికాదేవి అమ్మవారి ఆలయం చోళుల కాలంలో ప్రతిష్ఠించారు. కాలక్రమేణా ఆలయం శిథిలావస్థకు చేరడంతో ఆలయాన్ని తొలగించి దాతల సహాయంతో ఆలయాన్ని నిర్మించారు. ఆలయంపై అష్టాదశ శక్తి పీఠాల దేవతల విగ్రహాలతోపాటు నవదుర్గల ప్రతిమలను స్థాపించారు. ఈనెల 22 నుంచి 24న వరకు విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించనున్నారు. శనివారం ప్రాతఃకాలంలో కాళికాదేవి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.

రామాపురం వాసికి డాక్టరేట్



శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన సంగాల ప్రదీప్‌కుమార్‌రెడ్డికి డాక్టరేట్ పట్టా వరించింది. గ్రామానికి చెందిన సంగాల రామిరెడ్డి, శశికళ కుమారుడు ప్రదీప్‌రెడ్డి జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో డాక్టర్ పట్టా పొందారు. అదే యూ నివర్సిటీలో ఇమేజ్ ప్రాసెసింగ్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలు లేక అవస్థలు

- ధాన్యం సేకరణలో ఇబ్బందులు
- దోపిడీని అరికట్టాలని రైతుల వేడుకోలు



ఉండవెల్లిలో ఆరబెట్టిన మొక్కజొన్న

ఉండవెల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు దండుకుంటున్నారు. గతేడాది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఈ సారి ఎన్నికల నేపథ్యంలో అధికారులు కొనుగోలు కేంద్రాలు మరిచారా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఓట్ల కోసమే కాని రైతు కోసం ఎలాంటి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని పరిస్థితి నెలకొంది. మక్కలు అమ్మేందుకు ప్రైవేటు సంస్థల వద్దకు వెళ్లి వేడుకునే పరిస్థితి నెలకొంటోంది. రాష్ట్రంలో నాయకులను మాత్రమే పట్టించుకుంటారా, రైతులను పట్టించుకోరా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో..

అలంపూర్ నియోజకవర్గంలో గతంలో మక్కలు పీఏసీఎస్ ద్వారా కొనుగోలు చేశారు. కాని ప్రస్తుతం పంటలు దిగుబడి తక్కువ రావడంతో రైతులు కన్నీటిపర్యాంతమయ్యారు. అలంపూర్ డివిజన్‌లో 12,953 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయడంతో నష్టాలపాలైనట్లు రైతులు ఆవేదనకు గురవుతున్నారు. ఈ సారి కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో కోళ్ల దాణాకు, ఫ్యాక్టరీలకు అమ్ముకుంటున్నారు. అలంపూర్ డివిజన్‌లో దళారీ వ్యవస్థ అధికమై మార్కెట్ ప్రస్తావనే లేకపోవడంతో రైతులు ఆగమవుతున్నారు.

ఎకరానికి కేవలం 6 నుంచి 10 క్వింటాలే..

అలంపూర్ డివిజన్‌లో ప్రతి మండలంలోని రైతులు మొక్కజొన్న సాగు చేయడంతో వాటి దిగుబడి ఎకరానికి 6 క్వింటాలు నుంచి 10 క్వింటాలు మాత్రమే వచ్చింది. దాదాపు రూ.30 వేల నుంచి 50 వేలు ఖర్చు పెట్టినట్లు రైతులు తెలిపారు. కొందరు బోరుల ద్వారా పంటలను తడిపి దిగుబడి ఆశించిన ఎలాంటి ఫలితం లేదని రైతులు తెలిపారు.

అమ్మకానికి ఇబ్బందులు..



పంటలు కష్టపడి పండించినా అమ్మకాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి రైతు పంట చేతికొచ్చాక దిగుబడి రాక కొ నుగోలు లేక నానా అవస్థలు పడుతున్నాం. మార్కెట్ ఉన్న లేనట్లే ఉంది. మార్కెట్‌లో అన్ని అందుబాటులో కొనుగోలు చేసేలా నాయకులు చూ డాలి. మొక్కజొన్న దళారులకు అమ్ముకుంటున్నాం.

– రామకోటిరెడ్డి, రైతు, ఉండవెల్లి

రైతులు రావడం లేదు..

అలంపూర్ డివిజన్‌లో మొక్కజొన్న సాగు అధికంగా ఉండడం వాస్తవమే. కాని పీఏసీఎస్‌లకు అ నుమతులు అందించాం. మార్క్‌ఫెడ్ ధర రూ. 2090 ఉండడంతో బయట దానికంటే అధికంగా ఉందని బయటే అమ్ముకుంటున్నారని రైతులు రావడం లేదు. రైతులు అమ్మకాలకు వస్తే మేము సిద్ధంగా ఉన్నాం.

– హనుమంతురెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు



చిన్న ధన్వాడలో కవాతు చేస్తున్న బలగాలు

రాజోళి: ఎన్నికల్లో నాయకులు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ ఖాదర్ బాషా అన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మంగళవారం మండలంలోని చిన్న ధన్వాడలో సీఏపీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే, మద్యం, డబ్బు, ఇతర వస్తువులు చూపి ఓట్లను దండుకునే ప్రయత్నం చేస్తే చర్యలు తప్పవన్నారు. ప్రత్యేకంగా రూపొందిన సీ-విజిల్ యాప్ గురించి తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు కలిగినా తమకు సమాచారం అందించాలని, వెంటనే చర్యలు ఉంటాయని తెలిపారు.

పోషకాల ఆహారంతోనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్వరూపారాణి

మల్దకల్: పోషకాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం ద్వారానే గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ స్వరూపారాణి తెలిపారు. ఆరోగ్య మహిళను పురస్కరించుకుని మంగళవారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలకు డాక్టర్ వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ షుగర్, బీపీ, క్యాన్సర్ వంటి రోగాలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య మరింత పెంచాలన్నారు. 30ఏళ్ల పైబడ్డ వారందరికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి వారి వివరాలను రికార్డులలో పొందుపరచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందుతున్న పోషకాహారంను గర్భిణులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయమ్మ, సూపర్‌వైజర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలి



అలంపూర్‌లో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అలంపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలో ఓటు హక్కు వినియోగంపై చైన్య ప్రచార రథం ద్వారా మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు చైతన్యం కావాలన్నారు. ఓటు ఒక వజ్రాయుధమన్నారు. మున్సిపాలిటీలో వందశాతం పోలింగ్ నమోదు కావాలన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో చైతన్య ప్రచార రథం ద్వారా ఓటు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు అహ్మద్ షరీఫ్, నారాయణ, వార్డు అధికారులు ఆంజనేయులు, రామకృష్ణ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలి



జెండాను ఆవిష్కరిస్తున్న తెలుగు ముదిరాజ్ మత్స్యకారుల సంఘం నాయకులు

గద్వాల అర్బన్: ముదిరాజ్‌లకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించాలని తెలుగు ముదిరాజ్ మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. మంగళవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయం వద్ద తెలుగు ముదిరాజ్ జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. 18ఏళ్ల నిండిన ముదిరాజ్‌లకు మత్స్యశాఖలో సభ్యత్వం, ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సంజీవులు, నాయకులు జయరాములు, శివరాజ్, జగదీష్, నర్సింహులు, శ్రీను, చిన్న, వెంకటేష్, మహేందర్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



శివాలయంలో దీపాలను వెలిగించిన భక్తులు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని కృష్ణానదిలో స్నానాలాచరించారు. అనంతరం శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించుకొని ధ్వజ స్తంభాల ముందు, నది దగ్గర భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలి



గోవర్ధనగిరిలో జెండాను ఎగరవేస్తున్న జిల్లా డైరెక్టర్ సురేంద్రబాబు

వీపనగండ్ల: మత్స్యకారులు ఎదుర్కుంటున్న సమస్యలను గుర్తించి సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయత్నించాలని జిల్లా మత్స్యకారుల సంఘం డైరెక్టర్ మేకల సురేంద్రబాబు, రాష్ట్ర సంఘం నాయకులు బొలమోని ధర్గేష్ అన్నారు. మంగళవారం ప్రపంచ మత్స్యకారులు దినోత్సవాన్ని పురస్కరించుకొని గోవర్ధనగిరి గ్రామంలో మత్స్యకారుల జెండాను ఎగరవేసి మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరు సమన్వయంతో వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటస్వామి, బాలస్వామి, స్వామి, కృష్ణయ్య, రవి, సురేష్, నరేష్, లక్ష్మయ్య, పుల్లయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన



పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన కలిపిస్తున్న అధికారులు

వీపనగండ్ల: వికలాంగులు సీనియర్ సిటీజన్ వినియోగించుకోనున్న పోస్టల్ బ్యాలేట్‌పై అధికారులు మంగళవారం గోపల్‌దిన్నె, కల్వరాల్ల, సంగినేనిపల్లి, వీపనగండ్ల, బొల్లారం తదితర గ్రామాలలో అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ఉమ్మడి చిన్నంబావి, వీపనగండ్ల, పాన్‌గల్ మండలాలో ఎన్నికల ప్రత్యేక అధికారి ఇట్టి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఎంపీడీఓ కత్తలప్ప తెలిపారు. వీపనగండ్ల మండలంలో 18 మంది, చిన్నంబావిలో 12 మంది, పాన్‌గల్‌లో 3 పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోనున్నట్లు వారు తెలిపారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆత్మకూర్: మండల మహిళా సమాఖ్య, ఐకే పీ ఆధ్వర్యంలో మంగళవారం మూలమల్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీసీ అన్వర్‌పాషా ప్రారంభించారు. గ్రేడ్ 1కు ధర రూ.2,203, గ్రేడ్2 ధాన్యానికి రూ. 2,183 ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.